




# DD9 వార్త

తెలుగు దినపత్రిక


## మత్తు వద్దు.. ప్లాస్టిక్ వద్దు..



03

సంపుటి : 02 సంచిక : 237 హైదరాబాద్, ఏప్రిల్, శనివారం 18, 2026 పేజీలు : 06 వెల : 3.00



## మేడిగడ్డ పునరుద్ధరణపై సర్కారు నజర్..

**మేడిగడ్డపై సర్కారు ఫోకస్**
**20న సీఎం రేవంత్ పర్యటన**
**సాయిల్ టెస్టింగ్‌కు ప్రాధాన్యం**
**గత ప్రభుత్వంపై విమర్శలు**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతులు , పునరుద్ధరణ పనులపై తెలంగాణ ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో ఈనెల 20వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి తాను స్వయంగా మేడిగడ్డ బ్యారేజీని సందర్శించనున్నట్లు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. ఢిల్లీలో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (NDSA) చైర్మన్ అనిల్ జైన్‌తో భేటీ అయిన మంత్రి, ప్రాజెక్టు ...మిగతా 2లో

# యాసంగి ధాన్యం కొనుగోలు చేయండి

**30 లక్షల టన్నుల పారా బాయిల్డ్ కొనుగోలు కోరుతూ రేవంత్-ఉత్తమ్ వినతి**
**కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషితో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమావేశం**
**2025-26 యాసంగి పంట 90 లక్షల మెట్రిక్ టన్నులు వస్తాయని అంచనా**
**అందులో 30 లక్షల టన్నుల పారా బాయిల్డ్ ధాన్యం కొనుగోలు చేయాలని విజ్ఞప్తి**
**ధాన్యం సేకరణలో కేంద్ర వాటా పెంచాలని రాష్ట్రం డిమాండ్**
**రైతులకు గిట్టుబాటు ధర అందేలా చర్యలు తీసుకోవాలని కోరింపు**
**ఎఫ్‌సీఐ ద్వారా కొనుగోలు వేగవంతం చేయాలని విజ్ఞప్తి**
**నిల్వలు, రవాణా సమస్యలపై కేంద్రంతో చర్చ**
**గత సీజన్లలో ఎదురైన సమస్యలను ప్రస్తావించిన రాష్ట్రం**
**ధాన్యం నిల్వ సామర్థ్యం పెంపుపై చర్చ**
**రైతుల ప్రయోజనాల కోసం కేంద్ర-రాష్ట్ర సమన్వయం అవసరమని అభిప్రాయం**



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
యాసంగి పంట సీజన్ నేపథ్యంలో తెలంగాణలో ధాన్యం సేకరణ అంశం కీలకంగా మారింది. రాష్ట్రంలో భారీ స్థాయిలో ధాన్యం దిగుబడి వచ్చే అవకాశాలు కనిపిస్తున్న నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వం సహకారం అత్యవసరమని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి Revanth Reddy, వ్యవసాయ శాఖ మంత్రి Uttam Kumar Reddy కేంద్ర ఆహార, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి Pralhad Joshiతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా యాసంగి పంట ధాన్యం సేకరణ, కేంద్రం వాటా, నిల్వల నిర్వహణ, రవాణా సౌకర్యాలు వంటి అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. రాష్ట్రంలో 202526 యాసంగి సీజన్‌లో సుమారు 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని కేంద్ర మంత్రికి రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు.ఈ నేపథ్యంలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు ...మిగతా 2లో

# నా టార్గెట్ బీఆర్ఎస్సే

**పదేళ్లుగా కేటీఆర్ ప్రజల్లోకి ఎందుకు వెళ్లలేదన్న కవిత**
**ఇప్పుడు పాదయాత్ర చేస్తానంటే ఎవరు నమ్ముతారని ఎద్దేవా**
**అందరికీ అధికారం కావాలని తాను అన్న తర్వాతే కష్టాలు మొదలయ్యాయని వెల్లడి**



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన సోదరుడు కేటీఆర్ పై విమర్శల దాడిని ఉద్ధృతం చేశారు. హైదరాబాద్‌లోని జాగృతి కార్యాలయంలో పలు సామాజిక సంఘాల నేతలతో భేటీ అయిన ఆమె, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై రాజీకయంగా అత్యంత ఆసక్తికర ...మిగతా 2లో



## హర్మూజ్ జలసంధిపై ఉద్రిక్తతలు

**వాణిజ్య నౌకాయాన భద్రతపై భారత్ ఆందోళన**
**వాణిజ్య నౌకలపై దాడులను ఖండించిన భారత్**
**ఐరాస వేదికగా భద్రతా అంశాలపై గట్టిగా స్వరం**
**స్వేచ్ఛా నావిగేషన్ పునరుద్ధరణకు డిమాండ్**
**ఇంధన భద్రతకు హర్మూజ్ ప్రాధాన్యం**
**అంతర్జాతీయ చట్టాల పాటనపై దృష్టి**
**ఇరాన్–గల్ఫ్ ఉద్రిక్తతలపై ఆందోళన**
**ప్రపంచ వాణిజ్యంపై పెరుగుతున్న ప్రభావం**
**దౌత్యపరమైన పరిష్కారాలకే భారత్ మద్దతు**

**నేషనల్‌బ్యూరో, (డిడి9 వార్త):**
పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల మధ్య హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకల భద్రతపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అంతర్జాతీయ వాణిజ్యానికి కీలక మార్గంగా ఉన్న ఈ జలసంధిలో ఇటీవల చోటుచేసుకుంటున్న దాడులు ప్రపంచవ్యాప్తంగా చర్చకు దారి తీస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి సాధారణ సభలో భారత్ తన అభిప్రాయాన్ని స్పష్టంగా వెల్లడించింది. భారత శాశ్వత ప్రతినిధి హరీశ్ పర్వతనేని వాణిజ్య నౌకలపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తూ, సముద్ర మార్గాల్లో సురక్షిత నావిగేషన్‌ను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.హర్మూజ్ జలసంధి ప్రపంచ ఇంధన సరఫరాలో కీలక పాత్ర పోషిస్తోంది. పశ్చిమాసియా దేశాల నుంచి ప్రపంచవ్యాప్తంగా చమురు, వాయు సరఫరాలు ప్రధానంగా ఈ మార్గం ...మిగతా 2లో

# మహిళా బిల్లు ముసుగులో భారీ కుట్ర

**దేశ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చబోతున్నారు**
**శాశ్వతంగా బీజేపీ అధికారంలో ఉండేలా ప్లాన్**
**2023లోనే ఆమోదం పొందిన బిల్లును అమలు చేయాలి**
**కొత్త బిల్లుతో రాజకీయ చిత్రపటాన్ని మార్చే ప్రయత్నం**
**పాత బిల్లును రద్దు చేసి మళ్లీ తీసుకురావాలి**
**బీసీ, దళిత, మైనార్టీల హక్కులపై దాడి**
**కులగణనతో సంబంధం లేకుండా సరిహద్దుల మార్పు ఎందుకు?**
**భాజపా ఓబీసీలకు అధికారం ఇవ్వదు**
**దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాలపై వివక్ష**
**పార్లమెంటులో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు**



**నేషనల్‌బ్యూరో, (డిడి9 వార్త):**
లోక్‌సభలో మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులపై చర్చ వేడెక్కింది. ఈ సందర్భంగా ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. 2023లోనే ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ బిల్లును వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, ప్రస్తుతం ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లు మహిళల సాధికారత కోసం కాదని ఆరోపించారు. మహిళా బిల్లును ముసుగుగా ఉపయోగించి దేశ రాజకీయ వ్యవస్థను మార్చే ప్రయత్నం జరుగుతోందన్నారు. లోక్‌సభ స్థానాల పెంపు, డీలిమిటేషన్ ప్రక్రియల ద్వారా అధికార సమీకరణలో మార్పులు తీసుకురావడమే అసలు ఉద్దేశమని వ్యాఖ్యానించారు. నిజంగా మహిళల కోసం కట్టుబడి ఉంటే, ఇప్పటికే ఆమోదం పొందిన బిల్లును అమలు చేయాలని సూచించారు."అంతగా కావాలంటే పాత మహిళా రిజర్వేషన్ బిల్లును రద్దు చేసి, అదే విషయాన్ని కొత్తగా తీసుకురండి. మేము ఎలాంటి అభ్యంతరం చెప్పకుండా మద్దతిస్తాం" అని స్పష్టం చేశారు. కానీ ప్రస్తుత బిల్లు మాత్రం పూర్తిగా వేరే లక్ష్యంతో తీసుకొచ్చారని విమర్శించారు. ప్రస్తుత ప్రతిపాదనలు బీసీలు, దళితులు, మైనార్టీలు, మహిళలపై ప్రభావం చూపే విధంగా ఉన్నాయని ఆయన ఆరోపించారు. "ఇది క్షమించరాని చర్య. ఓబీసీ సోదరుల నుంచి అధికారం లాక్కునే ప్రయత్నం జరుగుతోంది" అంటూ మండిపడ్డారు. డీలిమిటేషన్ అంశంపై కూడా రాహుల్ గాంధీ కేంద్రాన్ని నిలదీశారు. హోంమంత్రి అమిత్ షా ఇటీవల ...మిగతా 2లో

# బీజేపీ బెంగాల్ విరోధి

**మమతా బెనర్జీ సంచలన ఆరోపణలు**
**ప్రజల హక్కుల రక్షణకు మమత ప్రతిజ్ఞ**
**లౌకిక వాతావరణ పరిరక్షణపై స్పష్టమైన సందేశం**
**ఎన్నికల ప్రచారంలో సుడిగాలి పర్యటనలు**
**టీఎంసీ ఎమ్మెల్యే నివాసాల్లో ఐటీ సోదాలు**
**బీజేపీ-టీఎంసీ మధ్య తీవ్ర పోటీ**
**గత ఎన్నికల ఫలితాలపై విశ్లేషణ**
**ప్రస్తుత ఫలితాలపై తీవ్ర ఉత్కంఠ**



**నేషనల్‌బ్యూరో, (డిడి9 వార్త):**
పశ్చిమ బెంగాల్ రాజకీయాలు మరోసారి వేడెక్కుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ఉధృతంగా సాగుతున్న సమయంలో తృణమూల్ కాంగ్రెస్ ...మిగతా 2లో

# డీలిమిటేషన్‌పై రాజకీయ రగడ

మహిళా రిజర్వేషన్లు, సీట్ల పునర్విభజనపై వాదోపవాదాలు
**లోక్‌సభలో కీలక బిల్లులపై ఓటింగ్‌కు సన్నాహాలు**
మహిళా రిజర్వేషన్ల అమలుపై విపక్షాల డిమాండ్
సీట్ల సంఖ్య మార్పుపై అనుమానాలు వెల్లువ
రాజ్యాంగ సవరణ బిల్లుపై ఉపసంహరణ డిమాండ్
దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యంపై ఆందోళన
ప్రజాస్వామ్యంపై దాడి చేస్తున్నారన్న విమర్శలు
కుట్ర ఆరోపణలు, అజెండా రాజకీయాల చర్చ
ఎవరూ నష్టపోరంటూ బీజేపీ వాదన



**నేషనల్‌బ్యూరో, (డిడి9 వార్త):**
దేశ రాజకీయాల్లో మరోసారి కీలక చర్చకు దారి తీసిన డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల అంశాలపై కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లులు తీవ్ర వివాదానికి కేంద్రబిందువయ్యాయి. లోక్‌సభలో ప్రవేశపెట్టిన మూడు కీలక బిల్లులపై ఓటింగ్‌కు ముందు విపక్షాలు గట్టిగా అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించాలనే లక్ష్యంతో కేంద్రం చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించినప్పటికీ, దీనికి అనుసంధానంగా తీసుకొచ్చిన నియోజకవర్గాల పునర్విభజన ప్రతిపాదనలు రాజకీయంగా వేడెక్కిస్తున్నాయి. ముఖ్యంగా లోక్‌సభ ప్రస్తుత సీట్ల సంఖ్యను మార్చకుండా మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని విపక్షాలు పట్టుబడుతున్నాయి. ఈ పరిణామాల మధ్య రాజ్యాంగ సవరణ బిల్లును కూడా కేంద్రం ముందుకు తీసుకురావడం మరింత చర్చకు దారి తీసింది. ఈ బిల్లును వెంటనే ...మిగతా 2లో

# నా టార్గెట్ బీఆర్ఎస్సే

**మొదటిపేజీ తరువాయి**



వ్యాఖ్యలు చేశారు.

"పదేళ్ల పాటు అధికారంలో ఉన్నప్పుడు కేటీఆర్ ఎందుకు ప్రజల్లోకి పోలేదు? ఇప్పుడు పాదయాత్రలు చేస్తానంటే ఎవరు నమ్ముతారు?" అని ఆమె సూటిగా ప్రశ్నించారు. కేటీఆర్ పాదయాత్ర ప్రస్తావనను ఎద్దేవా చేస్తూ, అధికారంలో ఉన్నప్పుడు ప్రజలను పట్టించుకోని వారు ఇప్పుడు ప్రజల్లోకి వెళ్లడం వెనుక అర్థమేంటని నిలదీశారు.

సామాజిక తెలంగాణే లక్ష్యంగా తాను కొత్త రాజకీయ ప్రస్థానాన్ని మొదలుపెట్టానని, అందుకే తనకు అనేక కష్టాలు వచ్చాయని కవిత పేర్కొన్నారు. "అందరికీ అధికారం అందాలని నేను మాట్లాడటం మొదలుపెట్టాకే నాకు సమస్యలు ఎదురయ్యాయి. బీఆర్ఎస్ నన్ను సస్పెండ్ చేసినా, సామాజిక తెలంగాణ సాధించే వరకు నా పోరాటం ఆగదు" అని ఆమె స్పష్టం చేశారు.

తన కొత్త పార్టీకి మారోజు వీరన్న అనుచరులు, సీపీయూఎస్ఐ, దళిత బహుజన రాజ్యాధికార సంస్థ వంటి బహుజన సంఘాలు మద్దతు తెలపడం తనకు కొండంత బలాన్ని ఇస్తోందని ఆనందం వ్యక్తం చేశారు. వీరన్న అనుచరులు తనతో కలవడమంటే ఇక తమను ఆపే శక్తే లేదని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్‌కు చెందిన కొందరు మాజీ ఎమ్మెల్యేలు తనతో టచ్‌లో ఉన్నారని, సమయం వచ్చినప్పుడు వారి పేర్లు బయటపెడతానని బాంబు పేల్చారు. గ్రహగతులు అనుకూలించాలని, ఏదైనా శని అడ్డు ఉంటే తొలగిపోవాలని వారణాసిలో పూజలు చేసినట్లు కూడా ఆమె వెల్లడించారు.

# యాసంగి ధాన్యం కొనుగోలు చేయండి

**మొదటిపేజీ తరువాయి**

సాఫీగా సాగాలంటే కేంద్రం తక్షణ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ముఖ్యంగా, ఈ ఉత్పత్తిలో భాగంగా కనీసం 30 లక్షల మెట్రిక్ టన్నుల పారా బాయిల్డ్ ధాన్యాన్ని కేంద్రం కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేసింది. పారా బాయిల్డ్ రైస్ కొనుగోలుపై గతంలో వచ్చిన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ఈసారి ముందుగానే స్పష్టమైన విధానం ప్రకటించాలని కోరారు.

రైతులకు గిట్టుబాటు ధర అందేలా కేంద్రం హామీ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థించింది. మార్కెట్లో ధరలు పడిపోకుండా ఉండేందుకు ఎఫ్‌సీఐ ద్వారా ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని కోరారు. కొనుగోలు ప్రక్రియలో ఆలస్యం జరిగితే రైతులు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉందని రాష్ట్రం స్పష్టం చేసింది.

ఇక ధాన్యం నిల్వల సమస్య కూడా సమావేశంలో ప్రధాన చర్చాంశంగా మారింది. రాష్ట్రంలో గిడ్డంగుల సామర్థ్యం పరిమితంగా ఉండటంతో, భారీ స్థాయిలో వచ్చే ధాన్యాన్ని నిల్వ చేయడం కష్టంగా మారుతుందని అధికారులు వివరించారు. ఈ నేపథ్యంలో కేంద్రం అదనపు నిల్వ సౌకర్యాలు కల్పించాలనీ, అవసరమైతే ఇతర రాష్ట్రాలకు రవాణా సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

గత యాసంగి సీజన్లలో ఎదురైన సమస్యలను కూడా రాష్ట్రం ప్రస్తావించింది. ముఖ్యంగా పారా బాయిల్డ్ ధాన్యం కొనుగోలులో ఆలస్యం, విధాన స్పష్టత లేకపోవడం, రైతులు నిల్వల సమస్యలతో ఇబ్బంది పడటం వంటి అంశాలను గుర్తు చేసింది. ఈసారి అలాంటి పరిస్థితులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని కోరింది.

రైతుల ప్రయోజనాల దృష్ట్యా కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం అత్యంత అవసరమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రైతులు పండించిన పంటకు సరైన ధర లభించకపోతే వ్యవసాయం పట్ల ఆసక్తి తగ్గే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తులను సానుకూలంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. ధాన్యం సేకరణ, నిల్వల నిర్వహణ, రవాణా వంటి అంశాలపై



సంబంధిత శాఖలతో చర్చించి తగిన నిర్ణయాలు తీసుకుంటామని పేర్కొన్నట్లు తెలుస్తోంది.

మొత్తంగా, యాసంగి పంట ధాన్యం సేకరణపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని ఆశ్రయించడం ప్రాధాన్యత సంతరించుకుంది. రైతులకు నష్టాలు కలగకుండా, ధాన్యం కొనుగోలు సాఫీగా సాగేందుకు కేంద్రం తీసుకునే నిర్ణయాలు కీలకంగా మారనున్నాయి. ఈ నేపథ్యంలో రాబోయే రోజుల్లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించే విధానం రైతులకు ఎంతో ఉపశమనం కలిగించే అవకాశం ఉంది.

# హర్మూజ్ జలసంధిపై ఉద్రిక్తతలు

**మొదటిపేజీ తరువాయి**

ద్వారానే జరుగుతాయి. భారత్ వంటి దేశాలకు ఇది ఆర్థిక, ఇంధన భద్రత పరంగా అత్యంత ప్రాధాన్యమైన మార్గంగా నిలుస్తోంది. ఈ నేపథ్యంలో వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకుని దాడులు జరగడం తీవ్ర ఆందోళన కలిగించే అంశమని భారత్ పేర్కొంది. ఇటువంటి చర్యలు అంతర్జాతీయ న్యాయాలకు విరుద్ధమని, వీటిని సహించబోమని స్పష్టం చేసింది.

వాణిజ్య నౌకలపై దాడులు జరగడం వల్ల సముద్ర సిబ్బంది ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోందని భారత్ ఆవేదన వ్యక్తం చేసింది. భారతీయ నావికులు కూడా ఈ దాడుల్లో ప్రాణాలు కోల్పోవడం విచారకరమని తెలిపింది. అంతర్జాతీయ వాణిజ్య మార్గాల్లో భద్రతను కాపాడటం ప్రతి దేశ బాధ్యతగా భావించాలని సూచించింది. వాణిజ్య నౌకాయానాన్ని లక్ష్యంగా చేసుకునే సైనిక చర్యలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్రమైన ప్రభావం చూపుతాయని హెచ్చరించింది. హర్మూజ్ జలసంధిలో స్వేచ్ఛా నావిగేషన్ కొనసాగడం అత్యంత అవసరమని భారత్ అభిప్రాయపడింది. వాణిజ్య రవాణాకు ఎలాంటి అడ్డంకులు లేకుండా సాగేందుకు అంతర్జాతీయ చట్టాలను కచ్చితంగా పాటించాలని కోరింది. సముద్ర మార్గాల్లో స్వేచ్ఛా ప్రయాణాన్ని అడ్డుకోవడం అసలు ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేసింది. అన్ని దేశాలు అంతర్జాతీయ నిబంధనలను గౌరవిస్తూ వాణిజ్య కార్యకలాపాలు నిరాటంకంగా కొనసాగేందుకు సహకరించాలని పిలుపునిచ్చింది.

ఇరాన్ మరియు గల్ఫ్ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులపై భారత్ ప్రత్యేకంగా ఆందోళన వ్యక్తం చేసింది. ఇటీవల నెలకొన్న ఘర్షణలు మరింత తీవ్రమవకుండా అన్ని దేశాలు సంయమనం పాటించాలని సూచించింది. పరిస్థితులు అదుపులో ఉండేలా జాగ్రత్తగా వ్యవహరించాలని కోరింది. పౌరుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, సైనిక చర్యల కంటే దౌత్యపరమైన చర్చల ద్వారానే సమస్యలను పరిష్కరించాలని భారత్ స్పష్టం చేసింది. దేశాల సార్వభౌమత్వం, భౌగోళిక సమగ్రతకు గౌరవం ఇవ్వడం అంతర్జాతీయ శాంతి భద్రతలకు కీలకమని భారత్ పేర్కొంది. వివాదాలను చర్చల ద్వారా పరిష్కరించుకోవడం ద్వారానే దీర్ఘకాలిక స్థిరత్వం సాధ్యమవుతుందని తెలిపింది. హర్మూజ్ జలసంధిలో పరిస్థితులు అదుపులోకి రాకపోతే ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై మరింత ఒత్తిడి పడే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

ఇటీవల ఈ జలసంధి పరిస్థితులపై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో కూడా చర్చ జరిగింది. గల్ఫ్ దేశాల మద్దతుతో బహ్రెయిన్ ప్రవేశపెట్టిన తీర్మానంపై ఓటింగ్ జరిగినప్పటికీ, అది ఆమోదం పొందలేదు. కొన్ని దేశాలు వ్యతిరేకంగా ఓటు వేయడం, మరికొన్ని దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉండడం వల్ల తీర్మానం నిలిచిపోయింది. ఈ పరిణామాలు అంతర్జాతీయ స్థాయిలో ఏకాభిప్రాయం కొరవడిన దాన్ని సూచిస్తున్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో హర్మూజ్ జలసంధి ప్రాధాన్యం ఎంతో కీలకమైంది. ఈ మార్గం ద్వారా జరిగే చమురు, వాయు సరఫరాలు నిలిచిపోతే ప్రపంచ మార్కెట్లపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఇంధన ధరలు పెరగడం, సరఫరా గొలుసులు దెబ్బతినడం, వాణిజ్య కార్యకలాపాలు మందగించడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ఇటీవల జరిగిన ఉద్రిక్తతల కారణంగా నౌకా రవాణా సంఖ్య తగ్గడం, అంతర్జాతీయ వాణిజ్యంపై ప్రతికూల ప్రభావం పడడం గమనార్హం.

ప్రస్తుత పరిస్థితుల్లో హర్మూజ్ జలసంధి భద్రత కేవలం ప్రాంతీయ సమస్య కాకుండా ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపే అంశంగా మారింది. ఇంధన అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ మార్గం భద్రతకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. అందుకే అన్ని దేశాలు కలిసి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని భారత్ సూచిస్తోంది. దౌత్యపరమైన చర్చలు, పరస్పర సహకారం ద్వారానే శాంతి, స్థిరత్వం సాధ్యమవుతుందని స్పష్టం చేసింది. హర్మూజ్ జలసంధిలో నెలకొన్న ఉద్రిక్తతలు ప్రపంచ రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయి. వాణిజ్య నౌకాయాన భద్రతను కాపాడటం, స్వేచ్ఛా నావిగేషన్‌ను పునరుద్ధరించడం అత్యవసరంగా మారింది. ఈ దిశగా భారత్ గట్టిగా స్వరం వినిపిస్తూ, అంతర్జాతీయ సమాజం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరుతోంది.

# బీజేపీ బెంగాల్ విరోధి

**మొదటిపేజీ తరువాయి**



అధినేత్రి, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ బీజేపీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. బీజేపీని బంగ్లా విరోధిగా అభివర్ణిస్తూ, రాష్ట్ర ప్రజల హక్కులను కాపాడేందుకు చివరి వరకు పోరాటం కొనసాగిస్తానని స్పష్టం చేశారు. బంగాల్‌లో లౌకిక వాతావరణం, సామాజిక ఐక్యతను దెబ్బతీయడానికి ప్రయత్నించే శక్తులను అడ్డుకుంటానని ఆమె పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు ఆమె ఎన్నికల ప్రచారంలో భాగంగా కూచ్ బేహార్ జిల్లాలో చేసిన ప్రసంగంలో వెలువడ్డాయి.

తన రాజకీయ జీవితమంతా ప్రజలతోనే సాగిందని మమత వెల్లడించారు. విద్యార్థి దశలో ప్రారంభమైన రాజకీయ ప్రయాణం నుంచి ముఖ్యమంత్రి పదవికి చేరేవరకు సైద్ధాంతిక విలువలను ఎప్పుడూ వదల్లేదని తెలిపారు. ప్రజలే తన బలం, తన ఆస్తి అని పేర్కొంటూ, బంగాల్ ప్రజలు తృణమూల్ కాంగ్రెస్‌పై విశ్వాసం ఉంచాలని కోరారు. "మా, మాటీ, మనుష్" అనే నినాదంతో ప్రజలతో అనుబంధాన్ని మరింత బలపరిచే ప్రయత్నం చేశారు. రాష్ట్రంలో శాంతి, సామరస్యాన్ని కాపాడటం తన ప్రధాన లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మమత రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా పర్యటిస్తున్నారు. వరుసగా పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సభలు నిర్వహిస్తూ పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తున్నారు. నాలుగోసారి అధికారాన్ని కైవసం చేసుకోవాలనే లక్ష్యంతో టీఎంసీ తీవ్రంగా శ్రమిస్తోంది. మరోవైపు బీజేపీ కూడా ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని గట్టిపోటీ ఇస్తోంది. రెండు పార్టీల మధ్య నేరుగా పోటీ నెలకొనడంతో రాజకీయ వాతావరణం మరింత ఉత్కంఠభరితంగా మారింది.

ఈ నేపథ్యంలో టీఎంసీకి చెందిన ఎమ్మెల్యే దేవశిష్ కుమార్ నివాసం, కార్యాలయాలపై ఆదాయపు పన్ను శాఖ సోదాలు జరగడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. కోల్‌కతా నగర పరిధిలోని పలు ప్రాంతాల్లో ఒకేసారి ఈ సోదాలు నిర్వహించడంతో రాజకీయ వర్గాల్లో కలకలం రేగింది. కేంద్ర బలగాల భద్రత మధ్య జరిగిన ఈ తనిఖీలు ఎన్నికల సమయంలో మరింత ఉద్రిక్తతకు దారి తీశాయి. దీనిపై టీఎంసీ నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తూ, రాజకీయ ఉద్దేశ్యాలే కారణమని ఆరోపిస్తున్నారు. రాస్ బేహారీ అసెంబ్లీ నియోజకవర్గం కూడా ఈసారి ప్రధాన పోటీకి కేంద్రంగా మారింది. ఈ స్థానంలో టీఎంసీ అభ్యర్థిగా ఉన్న దేవశిష్ కుమార్‌కు ఎదురుగా బీజేపీ అభ్యర్థిగా స్వపన్ దాస్‌గుప్తా బరిలో నిలిచారు. ఈ నియోజకవర్గంలో జరిగే పోలింగ్‌పై రాజకీయ వర్గాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు విడతల్లో పోలింగ్ జరగనుండగా, మే 4న ఫలితాలు వెలువడనున్నాయి.

బంగాల్ అసెంబ్లీ ఎన్నికల చరిత్రను పరిశీలిస్తే గత కొన్నేళ్లలో రాజకీయ సమీకరణాలు గణనీయంగా మారాయి. 2016 ఎన్నికల్లో బీజేపీకి పరిమిత స్థాయిలో మాత్రమే విజయాలు లభించగా, 2021 ఎన్నికల్లో పార్టీ గణనీయంగా బలం పెంచుకుంది. ప్రధాన ప్రతిపక్షంగా అవతరించడం ద్వారా బీజేపీ రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తోంది. అదే సమయంలో టీఎంసీ తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ అధికారంలో నిలిచింది. ఈసారి ఎన్నికల్లో కూడా టీఎంసీ, బీజేపీ మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. కాంగ్రెస్, వామపక్షాలు గత ఎన్నికలతో పోలిస్తే బలహీనంగా కనిపిస్తున్నాయి. మొత్తం 294 అసెంబ్లీ స్థానాలున్న బంగాల్‌లో ఎవరు ఆధిక్యం సాధిస్తారన్నదానిపై ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఓటర్ల అభిప్రాయాలు ఎలా మారుతాయన్నది ఫలితాలను ప్రభావితం చేయనుంది.

మమతా బెనర్జీ ప్రచారంలో బీజేపీపై నేరుగా దాడులు చేయడం, బీజేపీ కూడా సమానంగా ప్రతిస్పందించడం వల్ల ఎన్నికల వేడి మరింత పెరిగింది. అభివృద్ధి, సంక్షేమం, సామాజిక సమతుల్యత వంటి అంశాలు ప్రధాన చర్చగా మారుతున్నాయి. ఓటర్లను ఆకర్షించేందుకు రెండు పార్టీలు విభిన్న వ్యూహాలతో ముందుకెళ్తున్నాయి. బంగాల్ రాజకీయాలు కీలక దశలోకి ప్రవేశించాయి.

# మేడిగడ్డ పునరుద్ధరణపై సర్కారు నజర్..

**మొదటిపేజీ తరువాయి**



తాజా పరిస్థితిపై సుదీర్ఘంగా చర్చించారు.

గోదావరి నదికి వరదలు వచ్చేలోగానే మేడిగడ్డ వద్ద సాయిల్ టెస్టింగ్ (మట్టి పరీక్షలు) పూర్తి చేసి, అవసరమైన కొత్త డిజైన్లను రూపొందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి తెలిపారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇచ్చే మార్గదర్శకాలకు అనుగుణంగానే తమ ప్రభుత్వం ముందుకు వెళ్తుందని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా, మేడిగడ్డ డ్యామేజీకి సంబంధించి జరిగే సాయిల్ టెస్ట్ , డిజైన్ల ఖర్చును ప్రభుత్వం భరించబోదని, ఆయా కాంట్రాక్ట్ సంస్థలే భరించాల్సి ఉంటుందని మంత్రి తేల్చి చెప్పారు.

కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు. "బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయింది. దాదాపు 97 వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి దీనిని నిర్మించారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు కోసం ఏటా 10 వేల కోట్ల రూపాయల వడ్డీ కట్టాల్సి వస్తోంది" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భారీ మొత్తంలో ప్రజాధనం ఖర్చు చేసినందున, దానిని ఎలాగైనా రిపేర్ చేసి ప్రజలకు ఉపయోగపడేలా చేయాలన్నదే తమ ప్రభుత్వ ఉద్దేశమని వివరించారు.

కాళేశ్వరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రికి గానీ, తమ ప్రభుత్వానికి గానీ ఎలాంటి రాజకీయ దురుద్దేశాలు లేవని మంత్రి స్పష్టం చేశారు. కేవలం ప్రజల సొమ్ము వృథా కాకూడదనే ఉద్దేశంతోనే పునరుద్ధరణ పనులపై దృష్టి సారించామని చెప్పారు. సాంకేతిక నిపుణుల సలహాలు, ఎన్‌డీఎస్‌ఏ నివేదికల ఆధారంగా పారదర్శకంగా ముందుకు వెళ్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి పునరుద్ఘాటించారు.

# మహిళా బిల్లు ముసుగులో భారీ కుట్ర

**మొదటిపేజీ తరువాయి**



కులగణన ప్రారంభమైందని ప్రకటించిన నేపథ్యంలో, అదే సమయంలో డీలిమిటేషన్ చేపట్టడం వెనుక ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. "కులగణన పూర్తికాకముందే సరిహద్దులు మార్చడం ఎందుకు? దీనికి సమాధానం చెప్పాలి" అని డిమాండ్ చేశారు. ఇంకా మాట్లాడుతూ.. దేశంలోని కీలక రంగాల్లో ఓబీసీలు, దళితుల ప్రాతినిధ్యం తక్కువగా ఉందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. న్యాయవ్యవస్థ, ప్రైవేటు రంగం, ఉన్నత బ్యూరోక్రసీ వంటి వ్యవస్థల్లో ఈ వర్గాలకు సరైన భాగస్వామ్యం లేదన్నారు. భాజపా ఓబీసీలకు అధికారం ఇవ్వడానికి సిద్ధంగా లేదని ఆరోపించారు. భాజపా తన రాజకీయ ప్రాబల్యం తగ్గిపోతుందనే భయంతోనే ఈ మార్పులు చేస్తున్నదని రాహుల్ వ్యాఖ్యానించారు. దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాలు, చిన్న రాష్ట్రాల ప్రయోజనాలను కేంద్రం పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. "ఈ బిల్లులన్నింటిని ప్రతిపక్షాలు కలిసి ఓడిస్తాయి" అని స్పష్టం చేశారు. ఇదే సమయంలో ప్రధాని నరేంద్ర మోదీపై కూడా రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. ప్రసంగంలో భాగంగా మోదీని పరోక్షంగా 'ఇంద్రజాలికుడు'గా వ్యాఖ్యానించడంతో సభలో ఉద్రిక్తత నెలకొంది. ఈ వ్యాఖ్యలపై స్పీకర్ ఓం బిర్లా అభ్యంతరం వ్యక్తం చేశారు.

భాజపా సభ్యులు రాహుల్ వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. ప్రధానమంత్రిని అవమానించారని ఆరోపిస్తూ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్, కేంద్ర మంత్రి కిరణ్ రిజుజు రాహుల్ గాంధీపై మండిపడ్డారు.

దీనితో సభలో కొంతసేపు గందరగోళం నెలకొంది. అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి. స్పీకర్ జోక్యం చేసుకొని సభను సజావుగా నడిపించే ప్రయత్నం చేశారు.

మొత్తంగా మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులపై లోక్‌సభలో చర్చ మరింత రాజకీయ రంగు దాల్చింది. అధికార, ప్రతిపక్షాల మధ్య భిన్నాభిప్రాయాలు స్పష్టంగా బయటపడుతున్నాయి. రాబోయే రోజుల్లో ఈ బిల్లులపై మరింత ఉత్కంఠభరిత చర్చ జరిగే అవకాశం కనిపిస్తోంది.

# డీలిమిటేషన్‌పై రాజకీయ రగడ

**మొదటిపేజీ తరువాయి**

ఉపసంహరించుకోవాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. అన్ని రాజకీయ పార్టీలతో చర్చించి, సమగ్ర అవగాహనతో ముందుకు వెళ్లాలని కోరుతున్నాయి. మహిళా సాధికారత పేరుతో కేంద్రం రాజకీయ ప్రయోజనాల కోసం ప్రయత్నిస్తోందని విమర్శలు వినిపిస్తున్నాయి. మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని ఇప్పటికే ఆమోదించిన నేపథ్యంలో అమలు విషయంలో జాప్యం ఎందుకు జరుగుతోందని ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.

కాంగ్రెస్ తరఫున స్పందించిన కేసీ వేణుగోపాల్ ప్రస్తుత లోక్‌సభ సీట్ల సంఖ్యను అలాగే ఉంచి మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని స్పష్టం చేశారు. కేంద్రం నిజంగా మహిళా సాధికారతకు కట్టుబడి ఉంటే, ఇప్పటికే ఆమోదం పొందిన చట్టాన్ని అమలు చేయడంలో ఆలస్యం ఎందుకు జరిగిందని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే ప్రయత్నంగా ఈ చర్యలను అభివర్ణిస్తూ, విపక్షాలు దీనికి వ్యతిరేకంగా నిలుస్తాయని తెలిపారు. ఇక బీహార్ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న తేజస్వీ యాదవ్ ఈ బిల్లుల వెనుక లోతైన రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ల అంశాన్ని వేరుగా చూడాల్సిన అవసరం ఉండగా, దానికి నియోజకవర్గాల పునర్విభజనను అనుసంధానించడం ఉద్దేశపూర్వక చర్యగా అభివర్ణించారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీయడానికి కేంద్రం ప్రయత్నిస్తోందని తీవ్రంగా విమర్శించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ తమ రాజకీయ అజెండాను అమలు చేయడానికే ఈ విధానాలు అనుసరిస్తున్నాయని అన్నారు.

దక్షిణాది రాష్ట్రాల ఆందోళన కూడా ఈ చర్చలో ప్రధానంగా మారింది. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ డీలిమిటేషన్ బిల్లుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ బిల్లుతో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. కొత్తగా ఏర్పాటు చేసే డీలిమిటేషన్ కమిషన్ ద్వారా నియోజకవర్గాల పునర్విభజనను తమకు అనుకూలంగా మలచుకునే అవకాశాన్ని కేంద్రం కల్పించుకుంటోందని ఆరోపించారు. ఈ బిల్లును ప్రస్తుత రూపంలో అమలు చేస్తే అది పెద్ద మోసంగా మిగులుతుందని హెచ్చరించారు.

సమాజ్‌వాదీ పార్టీ తరఫున రాంగోపాల్ యాదవ్ కూడా కేంద్రంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. మహిళా రిజర్వేషన్ల చరిత్రను మార్చే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ఇప్పటికే ఆమోదం పొందిన బిల్లుకు మళ్లీ కొత్త రూపం ఇవ్వడం వెనుక రాజకీయ ఉద్దేశాలే ఉన్నాయని అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వం పారదర్శకత లేకుండా వ్యవహరిస్తోందని విమర్శించారు. మరోవైపు బీజేపీ నాయకత్వం మాత్రం ఈ విమర్శలను ఖండిస్తోంది. పార్టీ తరఫున స్పందించిన అన్నామలై డీలిమిటేషన్ వల్ల ఎవరూ నష్టపోరని స్పష్టం చేశారు. తమిళనాడులో ఎంపీ సీట్ల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా సీట్ల సంఖ్య పెరిగినా రాష్ట్రాల ప్రాతినిధ్య శాతం మారదని వివరించారు. ఈ బిల్లుతో సమతుల్య అభివృద్ధి సాధ్యమవుతుందని, అన్ని ప్రాంతాలకు సమాన అవకాశాలు లభిస్తాయని చెప్పారు.

ప్రస్తుతం జరుగుతున్న ఈ చర్చ దేశ రాజకీయాల్లో కీలక మలుపు తిప్పే అవకాశముంది. మహిళా రిజర్వేషన్ల అమలు, నియోజకవర్గాల పునర్విభజన, రాజ్యాంగ సవరణలు కలిసి విస్తృత ప్రభావాన్ని చూపే అంశాలుగా మారాయి. ఒకవైపు మహిళా సాధికారత అవసరాన్ని ఎవరూ ఖండించకపోయినా, దాని అమలు విధానం, సమయంపై విభేదాలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు డీలిమిటేషన్ ప్రక్రియలో పారదర్శకత, సమాన ప్రాతినిధ్యం అంశాలు కీలకంగా మారాయి. లోక్‌సభలో జరగనున్న ఓటింగ్‌తో ఈ బిల్లుల భవిష్యత్ నిర్ణయించబడనుంది. అయితే రాజకీయ వర్గాల్లో మాత్రం ఈ అంశంపై చర్చలు కొనసాగుతూనే ఉన్నాయి. విపక్షాలు తమ అభ్యంతరాలను గట్టిగా వ్యక్తం చేస్తుండగా, కేంద్రం తన నిర్ణయంపై దృఢంగా నిలుస్తోంది. ఈ నేపథ్యంలో వచ్చే పరిణామాలు దేశ రాజకీయ దిశను ప్రభావితం చేసే అవకాశం ఉన్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

# తిమ్మాపూర్ బస్టాండులో చలివేంద్రం ప్రారంభం....

**ఎల్లారెడ్డిపేట ఏప్రిల్ 17(డీడీ9 వార) :**

ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల తిమ్మాపూర్ పూర్ బస్టాండ్ ప్రాంతంలో ప్రజల దాహార్తిని దృష్టిలో పెట్టుకొని గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని గ్రామ సర్పంచ్ అంది సుభాష్ ప్రారంభించాడు. వేసవి కాలం దృష్ట్యా తీవ్రమైన ఎండలు ప్రయాణించే ప్రయాణికుల కోసం బస్టాండ్ ఆవరణలో చలివేంద్రాన్ని ప్రతి సంవత్సరము నిర్వహిస్తారని కార్యదర్శి సంపత్ కుమార్ తెలియజేశారు .ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ దేవేందర్ గ్రామపంచాయతీ వార్డు సభ్యులు పాలకవర్గం పాల్గొన్నారు.



# గోల్డెన్ అవర్‌లో సిపిఆర్ ప్రాణదాత : నిజామాబాద్ సీపీ పి.సాయి చైతన్య

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 17(డీడీ9 వార) :**

ఆపదలో ఉన్న ప్రాణాన్ని కాపాడడంలో మొదటి గంట అత్యంత కీలకమని, ఆ సమయంలో అందించే సిపిఆర్ బాధితుడికి పునర్జన్మను ప్రసాదిస్తుందని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న '99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా చేపట్టిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో ఐదవ రోజున సిపి కార్యాలయంలో బ్లూ కోర్టు సిబ్బందికి, ఆటో డ్రైవర్లకు సిపిఆర్ పద్ధతిపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రోడ్డు ప్రమాదాలు, గుండెపోటు సంభవించినప్పుడు ప్రజలతో నిత్యం అందుబాటులో ఉండే పోలీసులు, ఆటో డ్రైవర్లు ప్రాణరక్షణ నైపుణ్యాలను కలిగి ఉండడం ఎంతో అవసరమని అన్నారు. ప్రస్తుతం గుండెపోటు సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఈ ప్రాథమిక చికిత్సపై అవగాహన పెంచుకోవాలని కోరారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణలో వైద్య నిపుణులు పాల్గొని సిపిఆర్ చేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు. అకస్మాత్తుగా స్పృహ కోల్పోయిన వ్యక్తికి శ్వాస అందుతుందో లేదో గమనించి, నాడి తనిఖీ చేసిన తర్వాత ఛాతిపై రెండు చేతులతో ఒత్తిడి కలిగిస్తూ రక్తప్రసరణను ఎలా పునరుద్ధరించాలో నేర్పించారు. నీటిలో మునిగినప్పుడు, విద్యుత్ షాక్ తగిలినప్పుడు శరీరంలో పదునైన వస్తువులు గుచ్చుకున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విపులంగా తెలియజేశారు. అత్యవసర పరిస్థితుల్లో గాయపడిన వారిని అంబులెన్స్ వచ్చే వరకు ఎలా సంరక్షించాలో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ బస్వా రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, ఐఎంఏ ప్రతినిధులు డాక్టర్ విశాల్, డాక్టర్ రామనేశ్వర్ తో పాటు పలువురు వైద్యులు, పోలీసు అధికారులు మరియు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.








# ఆర్మూర్ లో విశ్వ హిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నిరసన

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 17(డీడీ9 వార) :**

దేశంలో పెరుగుతున్న వికృత జిహాదీ మనస్తత్వానికి, సమాజంలో చోటుచేసుకుంటున్న అసాంఘిక సంఘటనలకు వ్యతిరేకంగా విశ్వ హిందూ పరిషత్ మరియు బజరంగ్ దళ్ ఆర్మూర్ శాఖల ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. నాసిక్ లోని టీసీఎస్ ఘటనతో పాటు దేశవ్యాప్తంగా సాగుతున్న లవ్ జిహాద్ కుట్రలను తీవ్రంగా ఖండించారు. అటవీ, ప్రభుత్వ, సైనిక మరియు రైల్వే భూములను అక్రమంగా ఆక్రమించడాన్ని, ఆహార పదార్థాలను ఉద్దేశపూర్వకంగా అపవిత్రం చేస్తున్న చర్యలను వారు ఎండగట్టారు. ముస్లిం జనాభా అధికంగా ఉన్న ప్రాంతాల్లో హిందూ కుటుంబాల పట్ల వేధింపులు, గిరిజన బాలికలపై జరుగుతున్న అకృత్యాలకు వ్యతిరేకంగా ప్రజలు చైతన్యవంతులు కావాలని వారు పిలుపునిచ్చారు. దేశ వ్యతిరేక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉంటూ సామాజిక సామరస్యాన్ని కాపాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గాజుల దయానంద్, జిల్లా విశేషా సంపర్క్ ప్రముఖ్ అల్జపూర్ అక్షయ్, నగర కార్యదర్శి కొంగి రవి, జిల్లా ప్రచార ప్రముఖ్ బొచకర్ నిఖిల్, నగర ఉపాధ్యక్షులు గంజాల ప్రేమ్ తో పాటు బోబిడే కరణ్, ప్రవీణ్, అభిలాష్, శ్రీకాంత్, అరవింద్, సచిన్, సాయి, యోగేష్, రిషి, లింబాద్రి, రఘు, బిట్టు, అభినయ్, విజయ్, ధనుంజయ, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కొత్త పార్టీ ఆవిర్భావ పోస్టర్‌ను ఆవిష్కరించిన తెలంగాణ జాగృతి

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 17(డీడీ9 వార) :**

తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఈ నెల 25న హైదరాబాద్‌లో జరగనున్న నూతన పార్టీ ఆవిర్భావ సభకు సంబంధించిన పోస్టర్‌ను నిజామాబాద్ లోని కవిత కార్యాలయంలో ఘనంగా ఆవిష్కరించారు. మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లోని అద్వైయా కన్వెన్షన్‌లో (ఓఆర్ఆర్ ఎగ్జిట్ నెం. 6) నిర్వహించనున్న ఈ భారీ బహిరంగ సభలో కల్వకుంట్ల కవిత నూతన పార్టీని అధికారికంగా ప్రకటించనున్నారు. ఈ సందర్భంగా జాగృతి అడక్ కమిటీ సభ్యుడు అవంతి రావు మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లా నుంచి సుమారు 10 వేల నుండి 15 వేల మంది కార్యకర్తలు, ప్రజలు తరలిరానున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా భారీ ఏర్పాట్లు పూర్తి చేశామని, కవితకు మద్దతుగా నిజామాబాద్ జిల్లా నుంచి 200 కార్లు, 200 బస్సుల్లో ప్రజలు హైదరాబాద్‌కు తరలివస్తారని ఆయన తెలిపారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడిన నాయకురాలిగా కవిత ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం ఉందని, రాబోయే రోజుల్లో ఈ నూతన పార్టీ రాష్ట్రంలో అత్యంత శక్తివంతమైన శక్తిగా ఎదుగుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నిజామాబాద్ సొంత జిల్లా కావడంతో అక్కడి ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రజాక్, లక్ష్మీనారాయణ, భరద్వాజ్, కృష్ణమోహన్, ప్రవీణ్, నరేష్ నాయక్, కరిపే రాజు, రాఘవేందర్, బర్ల నరేష్, శోభవతి, రేఖ, అంజలి, దాత్రికా రేఖ, కౌసల్య, లలిత, లక్ష్మి మరియు వివిధ నియోజకవర్గాల కార్యకర్తలు పాల్గొన్నారు.






# ఫిట్‌మెంట్ పెంచాలి.. పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- **తహసీల్దార్‌కు ఉద్యోగ సంఘాల వినతి**

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 17(డీడీ9 వార) :**

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఉద్యోగ గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయుల కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం కమ్మర్ పల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు పెద్ద ఎత్తున కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ... రెండవ పీఆర్సీ నివేదికను శివశంకర్ కమిటీ నుంచి తెప్పించుకుని, ఉద్యోగులకు 51 శాతం ఫిట్‌మెంట్‌ను వెంటనే అమలు చేయాలని కోరారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను ఏకమొత్తంగా విడుదల చేయాలని, ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని వారు ఈ సందర్భంగా పట్టుబట్టారు. మొత్తం 63 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ప్రభుత్వానికి చేరవేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ అధ్యక్షులు పొద్దుటూరు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి అంజాద్, యూటీఎఫ్ అధ్యక్షులు సింగారి రాజేశ్వర్, టీపీయూఎస్ అధ్యక్షులు కిషన్, నెల్ల శ్రీనివాస్, రెవెన్యూ విభాగం నుంచి శరత్, ఐకేపీ ఏపీఎం కిరణ్‌తో పాటు పలు శాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పాల్గొన్నారు.

# జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు ఘన సన్మానం

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 17(డీడీ9 వార) :**

నిజామాబాద్ జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన ఫోరెన్సిక్ ప్రొఫెసర్ డాక్టర్ నాగమోహన్‌ను తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు ఘన్‌పూర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... డాక్టర్ నాగమోహన్ నాయకత్వంలో ఆసుపత్రిలో వైద్య సేవలు మరింత మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తారని, ఆసుపత్రి అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేందర్, ఉపాధ్యక్షులు ప్రవీణ్ రెడ్డి, రవిగౌడ్, కార్యనిర్వాహక కార్యదర్శులు సురేష్ రెడ్డి, సోమరిపెట్ స్వామి, కార్యవర్గ సభ్యులు రమేష్, విద్యా ప్రవీణ, సుధాకర్, మోహన్ రావు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



# మత్తు వద్దు.. ప్లాస్టిక్ వద్దు..

- **హసాకొత్తూర్ చైతన్య సభలో గ్రామస్తుల ప్రతిజ్ఞ**

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 17(డీడీ9 వార) :**

కమ్మర్ పల్లి మండలంలోని హసాకొత్తూర్ గ్రామంలో సామాజిక మార్పు దిశగా గ్రామ పంచాయతీ, గ్రామ అభివృద్ధి కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. రహదారి భద్రత, మత్తు పదార్థాల నియంత్రణ మరియు ప్లాస్టిక్ నిర్మూలనను ప్రధాన అజెండాగా చేపట్టిన ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు కీలక సూచనలు చేశారు. వాహనదారులు ప్రయాణాల్లో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నో హెల్మెట్ నో రైడ్ నినాదాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని పిలుపునిచ్చారు. గ్రామంలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధిస్తూ, దుకాణాలు, హోటళ్లు, మటన్ విక్రయ కేంద్రాల్లో ప్లాస్టిక్ సంచులకు బదులుగా ప్రత్యామ్నాయాలు వాడాలని, నిబంధనలు అతిక్రమిస్తే జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు. అలాగే గ్రామంలోకి ఐస్‌క్రీమ్ బండ్ల రాకను నిషేధిస్తూ ఇప్పటికే ఫ్లెక్సీల ద్వారా ప్రచారం చేపట్టారు. యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోకుండా తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిరంతరం నిఘా ఉంచాలని, వారిని సరైన మార్గంలో నడిపించాలని అతిథులు కోరారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా స్టీలు వస్తువుల వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నలిమెల రేవతి గంగారెడ్డి, ఎస్సై అనిల్, ఉప సర్పంచ్ ఏనుగు మనోహర్, వీడీసీ అధ్యక్షులు బంగ్లా లింబాద్రి, ప్రధానోపాధ్యాయురాలు అరుణా శ్రీ, ప్రముఖ న్యాయవాది ఎలేటి గంగాధర్ పాల్గొన్నారు. వీరితో పాటు వార్డు సభ్యులు పెద్ది సృజన్, కుందేటి శ్రీనివాస్, కనక నరసయ్య, ఐకేపీ సిబ్బంది, అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.






# 51 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీ ప్రకటించాలి

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 17(డీడీ9 వార) :**

తెలంగాణ ఉద్యోగ, గజిటెడ్ అధికారుల, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి పిలుపు మేరకు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం భీంగల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు భారీ నిరసన చేపట్టారు. జిల్లా చైర్మన్ నాశెట్టి సుమన్ కుమార్ ఆదేశాల మేరకు మధ్యాహ్న భోజన విరామ సమయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు మరియు అంగన్‌వాడీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు 51 శాతం ఫిట్‌మెంట్‌తో కూడిన పీఆర్‌సీని తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేశారు. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బిల్లులను వెంటనే విడుదల చేయాలని, అలాగే ఈహెచ్ఎస్ ఆరోగ్య కార్డులను మే 1వ తేదీ నుంచి పూర్తిస్థాయిలో అమల్లోకి తీసుకురావాలని కోరారు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని నినాదాలు చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ శ్రీనివాస్‌కు అందజేశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓస్ యూనిట్ ప్రతినిధి బి. సృజన్ కుమార్, ఎంపీడీఓ సంతోష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ గంగాధర్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు శేఖర్, ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ ఫోరం జిల్లా కార్యదర్శి బి. తిరుపతితో పాటు వివిధ విభాగాల రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




# ప్రభుత్వ ప్రసవాలు పెంచాలి

- **జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ రవీందర్**

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 17(డీడీ9 వార) :**

కమ్మర్ పల్లి మండలంలోని చౌట్ పల్లి రైతు వేదికలో ఆరోగ్య కార్యక్రమాలపై నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఆర్మూర్ జిల్లా ఉప వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రవీందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో గర్భిణీ స్త్రీల నమోదును వంద శాతం పూర్తి చేయాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రస్తుతం ఎండల తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు గృహ సందర్శన సమయంలో తమ వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకోవాలని, ఎండలో తిరిగే వారికి, నీరసంగా ఉన్నవారికి వీటిపై అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. వడదెబ్బ లక్షణాలు మరియు నివారణా చర్యల గురించి గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. సామాన్య ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో సిబ్బంది అంకితభావంతో పని చేయాలని కోరారు. ఈ సమావేశంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ స్పందన, ఆరోగ్య విస్తరణ అధికారి సత్యనారాయణ, పర్యవేక్షకులు స్వరూపతో పాటు వివిధ సెంటర్ల ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు మరియు ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు



# వారం రోజుల్లో ఫీజు బకాయిల విడుదల చేయాలి
# ప్రైవేట్ డిగ్రీ & పీజీ కళాశాలల మేనేజ్మెంట్ డిమాండ్

**కామారెడ్డి, ఏప్రిల్ 17(డిడి9 వార్త):**

గత నాలుగు నుంచి ఐదు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్ మరియు ఫీజు బకాయిల కారణంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు, ముఖ్యంగా ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ప్రైవేట్ డిగ్రీ & పీజీ కళాశాలల మేనేజ్మెంట్ రాష్ట్ర అధ్యక్షుడు బి. సూర్యనారాయణ రెడ్డి పేర్కొన్నారు. వారం రోజులలోగా ఈ బకాయిలను విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రైవేట్ కళాశాలల రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణతో కలిసి ఆయన మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న బకాయిలు వెంటనే చెల్లించకపోతే విద్యా వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందన్నారు. నేడు కామారెడ్డిలో జరిగిన ప్రైవేట్ డిగ్రీ మరియు పీజీ కళాశాలల రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో ఈ అంశంపై విస్తృతంగా చర్చ జరిగింది. ఈ సమావేశానికి టియూపిసిఎంఏ అధ్యక్షుడు డా. ఎం. జైపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరాల సుధాకర్, వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన అధ్యక్షులు, కార్యదర్శులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, నాన్‌ప్రొఫెషనల్ (జూనియర్, డిగ్రీ & పీజీ) కళాశాలలకు సంబంధించిన ఫీజు బకాయిలు సుమారు రూ.1500 కోట్ల వరకు ఉన్నాయని తెలిపారు. ఇందులో కనీసం రూ.1000 కోట్లను తక్షణమే విడుదల చేసి, ముఖ్యంగా పేద మరియు గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు ఉపశమనం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు హరిస్మరణ్ రెడ్డి, గురువేందర్ రెడ్డి, నిషిత రాజు, మారయ్య గౌడ్, సూర్య ప్రకాష్, సంజీవ్, గిరి తదితరులు పాల్గొన్నారు.









## మెకానిక్ షెడ్డుపై సీసీఎస్ దాడి : రేషన్ బియ్యం సీజ్

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 17(డీడీ9 వార) :**

పేదలకు పంపిణీ చేసే ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచి తరలిస్తున్న ముఠాపై నిజామాబాద్ సీసీఎస్ పోలీసులు మెరుపు దాడి చేశారు. పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఆదేశాల మేరకు సీసీఎస్ ఏసీపీ మస్తాన్ అలీ పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్లు సురేష్, సాయినాథ్, ఎస్సై మహేష్ తమ బృందంతో కలిసి గురువారం రాత్రి నగరంలోని నాలుగవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక మెకానిక్ షెడ్డుపై దాడి నిర్వహించారు. దళారుల ద్వారా పేదల నుండి సేకరించిన సుమారు 8.5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమ మార్గంలో తరలించేందుకు ఇక్కడ నిల్వ ఉంచినట్లు పోలీసులు గుర్తించారు. ఈ దాడుల్లో బియ్యంతో పాటు వాటిని తరలించడానికి ఉపయోగిస్తున్న ఒక స్కూటీని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడుతున్న మీర్జా అబ్బాస్ బేగ్‌ను అదుపులోకి తీసుకుని, తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం నాలుగవ టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓకు అప్పగించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రేషన్ బియ్యం అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా అధికారులు హెచ్చరించారు.

## మొక్కజొన్న, తెల్ల జొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

- **మార్క్‌ఫెడ్ ఎండీ వి. శ్రీనివాస్ రెడ్డి గారిని కలసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు**

**ఆదిలాబాద్ జిల్లా,**
**బోథ్, ఏప్రిల్ 17(డి డి 9వార్త )**

రైతుల ప్రభుత్వం అయిన కాంగ్రెస్ రేవంత్ రెడ్డి గారి ప్రభుత్వం ఆధ్వర్యంలో బోథ్‌లో కొనుగోళ్లు త్వరలో ప్రారంభం. బోథ్ నియోజకవర్గ రైతుల సమస్యల పరిష్కారానికి మాజీ కేంద్ర మంత్రి శ్రీ వేణుగోపాల్ చారి చొరవ చూపగా, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీ ఆడే గజేందర్ సహకారంతో కొనుగోలు ప్రక్రియ వేగవంతమవుతోంది. రైతుల ప్రభుత్వం అయిన కాంగ్రెస్ రేవంత్ రెడ్డి గారి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని నాయకులు పేర్కొన్నారు. మొక్కజొన్న, తెల్ల జొన్న కొనుగోళ్లపై సానుకూల పరిణామాలు కనిపిస్తున్నాయి. ఈ సందర్భంగా బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్ ఆధ్వర్యంలో చట్ల ఉమేష్, మెరుగు నరసింహ దాస్, యువ నాయకుడు అలపాటి అచ్యుతానంద రెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల్ చారి గారిని కలిసి రైతుల సమస్యలను వివరించారు. తక్షణమే బోథ్, ఇచ్చోడ మార్కెట్ యార్డుల్లో మొక్కజొన్న, తెల్ల జొన్న ప్రభుత్వ కొనుగోళ్లు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీ వి. శ్రీనివాస్ రెడ్డి గారిని కలిసి కొనుగోళ్లకు సంబంధించి అవసరమైన ఆర్డర్లు వెంటనే జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆర్డర్ కాపీ విడుదలైన వెంటనే కొనుగోళ్లు ప్రారంభం కావాలని తెలిపారు. ప్రస్తుతం సరైన ధరలు లేక రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని, ఈ చర్యలు వారికి ఉపశమనం కలిగించనున్నాయని నాయకులు పేర్కొన్నారు.



## శనగ పంట, మొక్కజొన్న పంటల కొనుగోలుపై సంధిగ్దత

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్, ఏప్రిల్ 17(డి డి 9వార్త ):-**

బోథ్ మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్‌కి తీసుకొచ్చిన శనగపంట, మొక్క జొన్న రైతులతో కలిసి రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనున్న మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలోని పాక్స్ ద్వారా కొనుగోలు చేయవలసిన అవసరం ఉన్న కానీ ఇంతవరకు కూడ ఏ ఒక్క రైతుది కూడా కొనుగోలు చేయకపోవడం చాలా హాస్యాస్పదంగా ఉందని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్న ఒక ప్రకటనలో తెలియపర్చడం జరిగింది. ఆదిలాబాద్ జిల్లలో శనగ పంట సాగువిస్తీర్ణం 47,227 ఎకరాలలో 16,493 మంది రైతులు పండించగా మరియు మొక్క జొన్న పంట సాగువిస్తీర్ణం 17,634 ఎకరాలలో 6,415 మంది పండించగా , తమ చేతికి వచ్చిన పంటని మార్కెట్ యార్డ్ కి తీసుకొని వస్తే తమ పంటలను వెంటనే కొనుగోలు చేసేవిదంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేసాడు. (ప్రభుత్వాలు మారిన ) గత, ప్రస్తుత ప్రభుత్వాలు కూడా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహారిస్తుందని, రైతుల పక్షపాతిగా ఉండవలసిందిపోయి రైతులని ఆర్థిక ఇబ్బందులు కలుగకుండా చూడవలసిన అవసరం ఎంతైనా ఉందని మరియు గత ఖరీఫ్ లో కురిసిన అతి భారీ వర్షాలకి అతి తీవ్రమైన పంట నష్టం జరిగింది. కానీ ఈ యాసంగిలో నీటి లభ్యత ఉన్న పంట పొలాల్లో ఎంతోకొంత గతం జరిగిన పంట నష్టాన్ని బేరీజు వేసుకుని ఆ నష్టాన్ని పుడ్చుకునే విదంగా ఈ రబిలోనైనా ఆర్థికపరమైన సమస్యల నుండి గట్టేక్కించడానికి దోహదపడుతుందని రైతుల అభిప్రాయాన్ని వ్యక్తం చేసిన సందర్భాలు ఉన్నాయని ఆయన ఆశభావాన్ని వ్యక్తం చేయడం జరిగింది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన పూర్తి పంటలను కొనుగోలు చేయాలనీ ఆయన అన్నారు. ఇందులో పాల్గొన్న రైతులు మహేందర్, చంద్రమోహన్ రెడ్డి, మురళి, విలేష్ తదితరులు పాల్గొన్నారు.



## పీఆర్సీ సాధనే లక్ష్యంగా ఉద్యోగుల పోరుబాట

**బోధన్, నిజామాబాద్ జిల్లా,**
**ఏప్రిల్ 17(డీడీ9 వార) :**

ప్రభుత్వ ఉద్యోగుల చిరకాల ఆకాంక్ష అయిన 51 శాతం ఫిట్‌మెంట్‌తో కూడిన పీఆర్సీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం బోధన్ పట్టణంలో ఉద్యోగ లోకం గర్జించింది. పట్టణంలోని వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ప్రదర్శనగా సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని తమ నిరసనను వ్యక్తం చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ వికాస్ మహతోను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని, అందరికీ వర్తించేలా మెరుగైన హెల్త్ కార్డులను పంపిణీ చేయాలని కోరారు. ప్రధానంగా సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, అలాగే సెప్టెంబర్ 1, 2004 కంటే ముందే నియామక ప్రక్రియ ప్రారంభమైన వారికి కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పాత పెన్షన్ సౌకర్యాన్ని కల్పించాలని వారు గట్టిగా డిమాండ్ చేశారు. తమ న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం పట్టించుకోకపోతే రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షులు కార్తీక్, టీఆర్ఎస్ఏ బాధ్యులు విట్టల్, పీఆర్టీయూ నాయకులు శంకర్, థామస్, ఎస్టీయూ నాయకులు నెమలి సంజీవ్, సలీం, పెన్షనర్ల సంఘ అధ్యక్షులు రాజేశ్వరరావు, టీఎన్జీఓ నాయకులు సాయిలు, శ్వేత ఆయా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



## సాలూరలో ఉద్యోగుల నల్ల బ్యాడ్జీలతో నిరసన

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్17(డీడీ9 వార) :**

పెండింగ్‌లో ఉన్న తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు సాలూర మండల కేంద్రంలో ఉద్యోగ లోకం సమర శంఖం పూరించింది. శుక్రవారం వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై తమ నిరసనను వినూత్నంగా వ్యక్తం చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం రెండవ పీఆర్సీ కమిటీ నివేదికను వెంటనే తెప్పించి, జూన్ 2వ తేదీలోపు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సుదీర్ఘ కాలంగా నిలిచిపోయిన జీపీఎఫ్, మెడికల్ బిల్లులు మరియు ఇతర సప్లిమెంటరీ బిల్లులను ఏకమొత్తంగా విడుదల చేసి ఉద్యోగుల ఆర్థిక ఇబ్బందులను తొలగించాలని కోరారు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, సీపీఎస్ విధానాన్ని పూర్తిగా రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని వారు స్పష్టం చేశారు. ఈ సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించని పక్షంలో రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు ఈ సందర్భంగా హెచ్చరించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దార్ నవాజ్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సాలూర మండల జేఏసీ అధ్యక్షులు, పీఆర్టీయూ మండల అధ్యక్షులు గంధపు సాయిలు, జేఏసీ కన్వీనర్ శ్రీకాంత్, పీఆర్టీయూ ప్రధాన కార్యదర్శి సింగారి లక్ష్మణ్ తో పాటు మండల రెవెన్యూ, పరిషత్ ఉద్యోగులు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## ఏఐపీకేఎంఎస్ జిల్లా నేతలకు ఖాజాపూర్‌లో ఘన సన్మానం

**బోధన్, నిజామాబాద్ జిల్లా,**
**ఏప్రిల్ 17(డీడీ9 వార) :**

అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీకి ఎంపికైన నాయకులకు సాలూర మండలంలోని ఖాజాపూర్ గ్రామంలో శుక్రవారం ఘన సన్మానం జరిగింది. ఖాజాపూర్‌కు చెందిన సి.హెచ్. రమేష్, తగ్గెల్లి గ్రామానికి చెందిన జి.దేవయ్యలు జిల్లా కమిటీ సభ్యులుగా నియమితులైన సందర్భంగా గ్రామంలోని అంబేద్కర్ యువజన సంఘం, జగ్జీవన్ రామ్ యువజన సంఘాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గ్రామంలోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం, నాయకులు జై భీమ్ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రముఖులు, యువజన సంఘాల నాయకులు కలిసి రమేష్, దేవయ్యలను శాలువాలతో సన్మానించి పూలగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారానికి వీరు నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సి.హెచ్. నాగయ్య, ఉప సర్పంచ్ చిద్రపు శ్రీనివాస్, ఎంపీటీసీ శంకర్, నాయకులు ఎం.పీ గంగాధర్, ఎం. రామ గౌడ్, చింతం శేషారావు, గోపి, పోతన్న, నర్సింలు, సోన్ కాంబ్లే నర్సింగ్, విట్టల్, శ్రీకాంత్, బాలాజీ, సయ్యద్ హైమద్ తదితరులు పాల్గొన్నారు.



## ఆసుపత్రిలో అగ్ని ప్రమాదాలపై అవగాహన

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 17(డీడీ9 వార) :**

అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు క్షణాల్లో స్పందించి, ప్రాణ నష్టాన్ని నివారించేలా బోధన్ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బందికి అగ్నిమాపక శాఖ అధికారులు దిశానిర్దేశం చేశారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం ఆసుపత్రి ప్రాంగణంలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బోధన్ అగ్నిమాపక కేంద్రం అధికారి కే. సుభాష్ మాట్లాడుతూ... ఆసుపత్రుల్లాంటి సున్నితమైన ప్రాంతాల్లో మంటలు చెలరేగినప్పుడు రోగులను సురక్షితంగా బయటకు తీసుకువచ్చే క్రమంలో అనుసరించాల్సిన వ్యూహాలను వివరించారు. ప్రమాదం జరిగిన వెంటనే ఆందోళనకు గురికాకుండా అందుబాటులో ఉన్న అగ్నిమాపక పరికరాలను ఎలా వినియోగించాలో సిబ్బందికి ప్రత్యక్షంగా చేసి చూపారు. నిరంతరం అప్రమత్తంగా ఉండటం ద్వారానే పెను ప్రమాదాలను ముందే అరికట్టవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ఎం. నర్సయ్య, మహ్మద్ నజీమ్, కే. గంగారం మరియు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



## సాలూరులో ద్విచక్ర వాహనం దగ్ధం

**బోధన్, నిజామాబాద్ జిల్లా,**
**ఏప్రిల్ 17(డీడీ9 వార) :**

గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి ముందు నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనానికి నిప్పు పెట్టిన సంఘటన మండల పరిధిలోని సాలూరలో చోటుచేసుకుంది. బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సంగెపు సాయిబాబు తన షైన్ ద్విచక్ర వాహనాన్ని గురువారం రాత్రి ఇంటి ఎదుట నిలిపి ఉంచారు. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని దుండగులు ఆ వాహనానికి నిప్పు పెట్టడంతో అది పూర్తిగా దగ్ధమైంది. బాధితుడు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు. ఈ ఘటనపై విచారణ జరిపి నిందితులను గుర్తించనున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.



# కోలీవుడ్‌కు మరో షాక్.. 'జైలర్ 2' సీన్స్ లీక్!

కోలీవుడ్‌లో వరుస లీకేజీల కలకలం చిత్ర పరిశ్రమను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. కొన్ని రోజుల క్రితమే 'జన నాయగన్' చిత్రానికి సంబంధించిన కీలక సన్నివేశాలు ఆన్‌లైన్‌లో ప్రత్యక్షం కాగా, ఇప్పుడు సూపర్ స్టార్ రజనీకాంత్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ సీక్వెల్ 'జైలర్ 2' షూటింగ్ ఫుటేజీ కూడా బయటకు రావడం సంచలనం సృష్టిస్తోంది.

నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ మూవీలోని ఒక కీలక సన్నివేశానికి సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియా వేదికగా వైరల్ అవుతోంది. ఈ పరిణామంతో షాక్‌కు గురైన నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ వెంటనే రంగంలోకి దిగింది. తమ యాంటీ పైరసీ టీమ్ నిరంతరం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లను పర్యవేక్షిస్తోందని, లీకైన కంటెంట్‌ను షేర్ చేసినా లేదా ప్రమోట్ చేసినా అటువంటి అకౌంట్లపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవడమే కాకుండా వాటిని శాశ్వతంగా తొలగిస్తామని హెచ్చరించింది. దాదాపు చివరి దశకు చేరుకున్న ఈ సినిమా షూటింగ్‌ను 2026 ఏప్రిల్ నాటికి పూర్తి చేసి, అదే ఏడాది జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. రమ్యకృష్ణ, యోగి బాబుతో పాటు మోహన్‌లాల్, శివరాజ్ కుమార్ వంటి దిగ్గజ తారలు నటిస్తున్న ఈ సినిమా స్థాయిని దృష్టిలో ఉంచుకుని, అభిమానులు ఎవరూ ఇటువంటి లీకేజీలను ప్రోత్సహించవద్దని, కేవలం అధికారిక అప్‌డేట్స్‌ను మాత్రమే ఫాలో అవ్వాలని చిత్ర యూనిట్ విజ్ఞప్తి చేస్తోంది. వరుసగా స్టార్ హీరోల సినిమాల దృశ్యాలు ఇలా లీక్ అవుతుండటం ఇప్పుడు కోలీవుడ్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది.




## కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్‌తో ప్రేమ..
# క్లారిటీ ఇచ్చిన కంగనా

బాలీవుడ్ స్టార్ హీరోయిన్, హిమాచల్ ప్రదేశ్‌లోని మండి నియోజకవర్గ ఎంపీ కంగనా రనౌత్ ఎప్పుడూ ఏదో ఒక విషయంతో వార్తల్లో నిలుస్తూనే ఉంటారు. తాజాగా ఆమె వ్యక్తిగత జీవితంపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్‌తో కంగనా ప్రేమలో ఉన్నారని త్వరలోనే వీరిద్దరూ పెళ్లి చేసుకోబోతున్నారనే రూమర్లు గత కొద్ది రోజులుగా వైరల్ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో కంగనా ఈ వార్తలపై స్పందిస్తూ తనదైన శైలిలో ఘాటుగా సమాధానమిచ్చారు.

చిరాగ్ పాశ్వాన్‌తో ఉన్న సంబంధంపై కంగనా స్పష్టతనిస్తూ.. "చిరాగ్ నాకు చాలా కాలంగా తెలుసు, అతను నాకు అత్యంత సన్నిహిత మిత్రుడు. మా మధ్య ఉన్నది కేవలం స్నేహం మాత్రమే. మా గురించి వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదు. మా మధ్య ఎలాంటి ప్రేమ గానీ, రొమాన్స్ గానీ లేవు". తామిద్దరం కలిసి గతంలో ఒక సినిమా చేసినప్పటి నుంచి ఈ బంధం కొనసాగుతోంది. మా మధ్య ఒకవేళ నిజంగానే ప్రేమ ఉండి ఉంటే ఈ పాటికి మాకు పెళ్లి అయ్యి పిల్లలు కూడా ఉండేవారు. ఇన్నేళ్లుగా మా మధ్య ఎలాంటి మార్పు రాలేదు. అది ఎప్పటికీ కేవలం స్నేహంగానే కొనసాగుతుంది" అంటూ కంగనా ఈ వార్తలను కొట్టిపారేశారు.

కంగనా రనౌత్ మరియు చిరాగ్ పాశ్వాన్ 2011లో విడుదలైన 'మిలే నా మిలే హమ్' చిత్రంలో జంటగా నటించారు. ఆ సినిమా తర్వాత చిరాగ్ రాజకీయాల్లోకి వెళ్లగా కంగనా సినిమాల్లో అగ్ర హీరోయిన్‌గా ఎదిగారు. ప్రస్తుతం ఇద్దరూ పార్లమెంట్ సభ్యులుగా కొనసాగుతున్నారు. ఇటీవల పార్లమెంట్ ఆవరణలో వీరిద్దరూ నవ్వుతూ పలకరించుకున్న ఫోటోలు వైరల్ కావడంతో ఈ రూమర్లు మళ్ళీ తెరపైకి వచ్చాయి. అయితే తాజాగా కంగనా ఇచ్చిన క్లారిటీతో ఈ వార్తలకు ఫుల్ స్టాప్ పడినట్లయింది.



## అంతా మార్చేసిన
# ఒక రోజు

ఒకే ఫ్లోర్‌లో.. ఒకే ఆఫీసులో పనిచేసే ఉద్యోగులం మనమిద్దరం. మీరా బహుశా నేను నీకు తెలియకపోవచ్చు.. నేను అంత సులభంగా నీకు కనిపించననీ తెలుసు.. నీలాంటి ఏంజెల్‌తో మాట్లాడడానికి కూడా నేను అర్హుణ్ణి కానంటూ ప్రేమించిన అమ్మాయిని చూస్తూనే తనలో తానే మదన పడిపోతున్నాడో ప్రియుడు. కానీ, ఆ మీరానే.. జ్ఞాపకశక్తిని కోల్పోయే అరుదైన వ్యాధితో బాధపడుతుందని తెలుసుకున్నాక ఏం చేశాడు? ఆమె తనని మర్చిపోతుందని తెలిసి కూడా ప్రేమించాడా? ఇలాంటి ప్రశ్నలకు సమాధానం కావాలంటే 'ఏక్‌దిన్' సినిమా చూడాల్సిందే. బాలీవుడ్ అగ్రహీరో ఆమిర్ ఖాన్ తనయుడు జునైద్ ఖాన్, సాయి పల్లవి జంటగా నటించిన చిత్రమిది. సునీల్ పాండే దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ఆమిర్ ఖాన్, మన్సూర్ ఖాన్, అపర్ణ పురోహిత్ సంయుక్తంగా నిర్మించారు. తెలుగులో 'ఒక రోజు' టైటిల్‌తో ఈ సినిమా మే 1న థియేటర్లలో విడుదల కానుంది. తాజాగా చిత్రబృందం..'అంతా మార్చేసిన ఒకరోజు' అనే క్యాప్షన్‌తో ఈ సినిమా రెండవ ట్రైలర్‌ని ఆవిష్కరించింది. 'ఆమె తన జ్ఞాపకాలను తిరిగి పొందాక.. ఈరోజుని శాశ్వతంగా మర్చిపోతుంది', 'ఇదంతా ఒక్కరోజు కోసమేనా..?', 'కొన్నిసార్లు ఒక్కరోజు చాలు' లాంటి సంభాషణలు, జపాన్‌లో హీరోహీరోయిన్ల మధ్య సాగే భావోద్వేగాలు, అర్జిత్ సింగ్ నేపథ్యగానంతో ఈ ట్రైలర్ ఆకట్టుకుంటోంది. ఈ సినిమాలో మీరా పాత్రలో అలరించనుంది సాయి పల్లవి.




# ఘట్టమనేని మూడో తరంలో స్టార్ అయ్యేదెవరు?

తెలుగు చిత్ర పరిశ్రమలో 'సూపర్ స్టార్' అనే పదానికి నిలువెత్తు రూపం కృష్ణ. ఆయన వారసత్వాన్ని సెకండ్ జనరేషన్‌లో మహేశ్ బాబు అద్భుతంగా ముందుకు తీసుకెళ్లారు. కానీ రమేశ్ బాబు 15 సినిమాల్లో నటించినా ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయారు. మంజుల కూడా నటిగా కంటే నిర్మాతగానే ఎక్కువ గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పుడు అందరి దృష్టి 'ఘట్టమనేని మూడో తరం' పైనే ఉంది. ఈ తరంలో అందరూ నటీనటులుగానే వెండితెరపై మెరవడానికి సిద్ధమవుతున్నారు.

రమేశ్ బాబు కుమారుడు జయకృష్ణ ఇప్పటికే తన అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సిద్ధమయ్యారు. గతంలో మహేశ్ బాబు సినిమా 'నిజం'లో చిన్నప్పటి మహేశ్‌గా నటించిన జయకృష్ణ ఇప్పుడు 'శ్రీనివాస మంగాపురం' సినిమాతో హీరోగా పరిచయం అవుతున్నారు. 'ఆర్ఎక్స్ 100' ఫేం అజయ్ భూపతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా టీజర్ ఇటీవలే విడుదలై మంచి టాక్ తెచ్చుకుంది. ఇందులో బాలీవుడ్ నటి రవీనా టాండన్ కూతురు రషా థడానీ హీరోయిన్‌గా నటిస్తుండటం విశేషం.

ఘట్టమనేని ఆడపడుచులు కూడా నటనపై ఆసక్తి చూపిస్తున్నారు. రమేశ్ బాబు కూతురు భారతి ఇప్పటికే సోషల్ మీడియాలో తన డాన్స్‌తో అందరినీ ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా 'కుర్చీ మడతపెట్టి' సాంగ్‌కు ఆమె వేసిన స్టెప్పులు వైరల్ అయ్యాయి, త్వరలోనే ఆమె హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చే అవకాశం ఉందనే వార్తలు వినిపిస్తున్నాయి. మరోవైపు మంజుల కూతురు జాన్వీ స్వరూప్ ఫోటోలు కూడా నెట్టింట హల్చల్ చేస్తున్నాయి. ఆమె బర్త్‌డే సందర్భంగా షేర్ చేసిన ఫోటోలు చూస్తుంటే జాన్వీ కూడా వెండితెర అరంగేట్రం చేసే సూచనలు కనిపిస్తున్నాయి.



సితార – గౌతమ్ లపై భారీ అంచనాలు సూపర్ స్టార్ మహేశ్ బాబు పిల్లలు సితార, గౌతమ్ లపై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి.

## తొందరపడే
# ప్రసక్తే లేదు!

సాధారణంగా భారీ బడ్జెట్ సినిమాలకు షూటింగ్ దశలోనే థియేట్రికల్, నాన్‌థియేట్రికల్ డీల్స్ క్లోజ్ అయిపోతుంటాయి కానీ 'స్పిరిట్' టీమ్ మాత్రం ఇందుకు భిన్నంగా వెళ్తోంది. ప్రస్తుతం ఈ సినిమాకు ఎలాంటి ఎక్స్టర్నల్ ఫైనాన్షియల్ బ్యాకింగ్ అవసరం లేదని సమాచారం. దీంతో నిర్మాతలు TSeriesతో పాటు ప్రభాస్, సందీప్ వంగా ముగ్గురూ కలిసి ఒక కీలక నిర్ణయానికి వచ్చారు. డిజిటల్, శాటిలైట్ సహా ఇతర నాన్‌థియేట్రికల్ హక్కులను ఇప్పుడే అమ్మకూడదని వారు గట్టిగా ఫిక్స్ అయ్యారు. నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్ వంటి దిగ్గజ ఓటిటి ప్లాట్‌ఫారమ్‌లు ఇప్పటికే భారీ ఆఫర్లతో మేకర్స్‌ని సంప్రదించినట్లు తెలుస్తోంది. సినిమా క్రేజ్ దృష్ట్యా రికార్డు స్థాయి ధరలను ఆఫర్ చేసినప్పటికీ, టీమ్ మాత్రం ససేమిరా అంటోంది.

సందీప్ రెడ్డి వంగా గత చిత్రం 'యానిమల్' సృష్టించిన సంచలనం అందరికీ తెలిసిందే. ఇప్పుడు ప్రభాస్‌తో కలిసి ఆయన చేస్తున్న ఈ 'పోలీస్ డ్రామా'పై మార్కెట్‌లో విపరీతమైన హైప్ ఉంది. ఈ ఏడాది చివరలో సినిమా ఒక కొలిక్కి వచ్చిన తర్వాతే, మార్కెట్ వాల్యూ మరింత పెరుగుతుందని మేకర్స్ భావిస్తున్నారు. అప్పుడే డీల్స్ క్లోజ్ చేస్తే ఊహించని రేంజ్ బిజినెస్ జరుగుతుందని వారి ప్లాన్. ప్రస్తుతానికి 'స్పిరిట్' మేకర్స్ దృష్టంతా అవుట్‌పుట్ మీద మాత్రమే ఉంది. ఈ ఏడాది ఆఖరి వరకు ఎలాంటి బిజినెస్ డీల్స్ ఉండకపోవచ్చని స్పష్టమవుతోంది. అంటే, ప్రభాస్ ఫ్యాన్స్ ఈ భారీ ప్రాజెక్ట్ అప్‌డేట్స్ కోసం మరికొంత కాలం వేచి చూడాల్సిందే. ఒకవేళ డీల్స్ గనుక ఓపెన్ అయితే మాత్రం, ఇండియన్ సినిమా హిస్టరీలోనే అది ఒక సరికొత్త రికార్డు కావడం ఖాయం.






# నిఖిల్ 'స్వయంభు'.. మామూలు రన్ టైమ్ కాదుగా?

టాలీవుడ్ యువ నటుడు నిఖిల్ సిద్ధార్థ్ ప్రస్తుతం స్వయంభు చిత్రంలో హీరోగా నటిస్తున్నాడు. సంయుక్తా మీనన్, నభా నటేష్ ఇందులో హీరోయిన్లుగా కనిపించనుండగా, భారత్ కృష్ణమాచారి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. మే 22న ఈ సినిమాను విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. అయితే ఇప్పటి వరకు అందుకు సంబంధించిన అధికారిక ప్రకటన మాత్రం వెలువడలేదు. ఇకపోతే ప్రస్తుతానికి ఈ సినిమాకు సంబంధించిన రన్‌టైమ్ ఫిక్స్ అయినట్లు తెలుస్తోంది.

ఈ మూవీ ఏకంగా 2 గంటల 51 నిమిషాల భారీ రన్‌టైమ్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈ మధ్యకాలంలో భారీ నిడివితో వచ్చిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద మంచి ప్రేక్షకాదరణ పొందుతున్నాయి. అయితే భారీ నిడివితో ప్రేక్షకులను అలరించాలంటే కంటెంట్ బలంగా ఉండటం చాలా ముఖ్యం. కథ, కథనం బలంగా ఉంటే ఇలాంటి పెద్ద రన్‌టైమ్ ఉన్న సినిమాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. లేకపోతే అదే అంశం సినిమాకు నష్టాన్ని కలిగించే అవకాశాలు కూడా ఉంటాయని సినీ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

## మహేష్ – రాజమౌళి 'వారణాసి'లో
# మరో బాలీవుడ్ భామ?

'రామాయణ' పార్ట్ 1 విడుదలైన రెండు నెలల్లోనే మరో భారీ ప్రాజెక్టుతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్. ఆయన హీరోగా ప్రముఖ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ 'లవ్ అండ్ వార్' చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఈ మూవీ రిలీజ్ డేట్ శుక్రవారం ఖరారైంది. 2027 జనవరి 21న ఈ సినిమా బాక్సాఫీసు ముందుకు రానుంది. హిందీతోపాటు తెలుగులోనూ విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ క్రేజీ మూవీలో రణ్‌బీర్ భార్య అలియా భట్ హీరోయిన్ కావడం విశేషం. విక్కీ కౌశల్ కీలక పాత్ర పోషిస్తున్నారు.

రణ్‌బీర్ ప్రధాన పాత్రలో నితీశ్ తివారీ 'రామాయణ' సినిమాని రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్నారు. ఇందులో రాముడిగా రణ్‌బీర్, సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్ కనిపించనుండటంతో ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. తొలి భాగం ఈ ఏడాది దీపావళికి (నవంబరు), రెండో భాగం వచ్చే ఏడాది దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. విడుదల తేదీల వివరాలు త్వరలో వెల్లడికానున్నాయి.

